

# ఈవీల ఉత్పత్తికి బ్రేక్!

## చైనా నుంచి ఆగిన రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్

న్యూఢిల్లీ, జూన్ 10: సెమీకండక్టర్ సంక్షోభం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న దేశీయ ఆటో పరిశ్రమను మరో ఉపద్రవం ముంచెత్తబోతున్నాదా! ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఇది నిజమేననిపిస్తున్నది. తమ దేశంలో లభించే అరుదైన రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించడంతో ప్రపంచవ్యాప్తంగా వీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడ్డాయి. ఈ తాజా పరిణామంతో వాహన ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపి భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈవీ విస్తరణ లక్ష్యాలను దెబ్బపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశీయ ఆటోమోటివ్ తయారీదారులు ప్రత్యేకంగా ఎలక్ట్రిక్ వాహన ఉత్పత్తిలో నిమగ్నమైన వారు అరుదైన భూ అయస్కాంతాల కొరత కారణంగా ఈ ఏడాది జూలై నాటికి తమ ఈవీ వాహనాల ఉత్పత్తిని నిలిపివేయక తప్పదని పరిశ్రమ వర్గాలు సూచించాయి.

### ఏమిటీ అరుదైన భూ అయస్కాంతం?

అధునాతన వాహనాలు ప్రత్యేకంగా ఎలక్ట్రిక్ వాహనాలు, హైబ్రిడ్‌లకు అరుదైన భూ అయస్కాంతాలు అత్యంత అవసరం. ఎలక్ట్రిక్ మోటర్లు, బ్రేకింగ్ సిస్టమ్, పవర్ స్టీరింగ్, సమర్థవంతంగా పనిచేయడం కోసం బలమైన ఆయస్కాంత శక్తిపై ఆధారపడే ఇతర సిస్టమ్‌లకు ఈ భూ అయస్కాంతం తప్పనిసరి. ప్రస్తుతం ప్రపంచ దేశాలకు 90 శాతానికి పైగా చైనా నుంచే ఇవి సరఫరా అవుతున్నాయి. కొన్ని అరుదైన మిశ్రమ లోహాలు, శాశ్వత ఆయస్కాంతాల ఎగుమతిపై ఈ ఏడాది ఏప్రిల్‌లో చైనా కఠిన నిబంధనలు విధించింది. జాతీయ భద్రతా ఆందోళనల కారణంగా ఈ చర్యలు తీసుకున్నప్పటికీ, అమెరికా విధించిన ప్రతీకార సుంకాలకు ప్రతిస్పందనగా ఈ చర్య తీసుకున్నట్లు స్పష్టమవుతోంది.

# ఈక్విటీ ఫండ్లకు తగ్గుతున్న గిరాకీ

న్యూఢిల్లీ/ముంబై, జూన్ 10: దేశీయ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ల (ఎంఎఫ్)కు గిరాకీ తగ్గిపోయింది. గత నెలలో వచ్చిన పెట్టుబడులు 13 నెలల కనిష్ఠానికి దిగజారాయి. మే నెలలో రూ.19,013 కోట్లకు పరిమితమయ్యాయి. 2024 ఏప్రిల్ తర్వాత ఈ స్థాయిలోనే ఉండటం ఇదే తొలిసారి. నాడు రూ.18,917 కోట్లు వచ్చాయి. కాగా, ఈసారి లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్ ఫండ్స్ అన్నింటిలోకి ఇన్వెస్ట్‌మెంట్లు పడిపోవడం గమనార్హం. మదుపరులు లాభాల స్వీకరణకు దిగడమే కారణమని మార్కెట్ నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. అలాగే సూచీలు కన్సాలిడేషన్ దశలోకి వెళ్తుండటం కారణమేనంటున్నారు.

**ఈక్విటీ ఎంఎఫ్‌ల్లోకి నానాటికి క్షీణిస్తున్న పెట్టుబడులు**

| నెల | పెట్టుబడులు (రూ.కోట్లలో) |
|---|---|
| డిసెంబర్ (2024) | 41,156 |
| జనవరి (2025) | 39,688 |
| ఫిబ్రవరి | 29,303 |
| మార్చి | 25,082 |
| ఏప్రిల్ | 24,269 |
| మే | 19,013 |

### వరుసగా ఐదో నెల

ఈక్విటీ ఫండ్స్‌ల్లోకి పెట్టుబడులు క్షీణించడం వరుసగా ఇది ఐదో నెల. ఇక ఈ ఏడాది ఏప్రిల్‌తో పోల్చితే మే నెలలో దాదాపు 22 శాతం పతనం కనిపిస్తున్నట్టు మంగళవారం భారతీయ మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ (యాంఫీ) తెలిపింది. ఈక్విటీ ఎంఎఫ్‌ల్లోకి నెలవారీగా ఎంతోకొంత పెట్టుబడులు రావడం మాత్రం ఇది (మే) 51వ నెల.

### సిప్‌లకు ఆదరణ

సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌కు ఇన్వెస్టర్లలో ఆదరణ బాగానే కనిపిస్తున్నది. మే నెలలో రూ.26,688 కోట్లు వచ్చాయి. ఏప్రిల్‌లో రూ.26,632 కోట్లుగా నమోదయ్యాయి.




**మే నెలలో పెట్టుబడుల తీరిది..**

- ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌ల్లోకి అత్యధికంగా రూ.3,841 కోట్ల పెట్టుబడులు.
- ఈక్విటీ ఆధారిత సేవింగ్ స్కీముల నుంచి రూ.678 కోట్ల పెట్టుబడులు ఉపసంహరణ.
- వాల్యూ ఫండ్స్‌ల నుంచి రూ.92 కోట్లు, డివిడెండ్ ఈల్డ్ ఫండ్స్‌ల నుంచి రూ.21 కోట్లు ఔట్.
- లార్జ్‌క్యాప్ ఫండ్స్‌ల్లోకి రూ.1,250 కోట్లు వచ్చాయి. ఏప్రిల్‌లో రూ.2,671 కోట్లు పోయాయి.
- మిడ్‌క్యాప్ ఫండ్స్ నుంచి రూ.2,808 కోట్లు వెనక్కి.
- స్మాల్‌క్యాప్ ఫండ్స్‌ల్లోకి రూ.3,214 కోట్లు రాక.
- రూ.292 కోట్ల పెట్టుబడుల్ని ఆకర్షించిన గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్).
- డెట్ ఫండ్స్‌ల నుంచి రూ.15,908 కోట్లు ఔట్.

## సెన్సెక్స్ లాభాలకు బ్రేక్

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం మిశ్రమంగా ముగిశాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ నష్టపోగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ స్వల్పంగా లాభపడింది. సెన్సెక్స్ 53.49 పాయింట్లు పడిపోయి 82,391.72 వద్ద ముగిసింది. అయితే 1.05 పాయింట్లు పెరిగి 25,104.25 వద్ద నిఫ్టీ నిలిచింది. నిజానికి అంతకుముందు 4 రోజులపాటు రెండు సూచీలు లాభాల్లోనే స్థిరపడ్డ విషయం తెలిసిందే. దీంతో వరుస లాభాలకు బ్రేక్ పడినట్లైంది. కాగా, ఐటీ, యుటిలిటీస్, పవర్, టెక్నాలజీ, హెల్త్‌కేర్, కమోడిటీస్ షేర్లు పెరిగాయి. రియల్టీ, టెలికం, ఆర్థిక సేవలు తదితర రంగాల షేర్లు నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 0.33 శాతం, స్మాల్‌క్యాప్ 0.04 శాతం చొప్పున పెరిగాయి. సెన్సెక్స్ షేర్లలో ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్, మారుతీ, ఆర్ఐఎల్ షేర్లు నష్టపోయాయి.

## నయా అపాచీ ఆర్‌టీఆర్ 200

ధర రూ.1,53,900

చెన్నై, జూన్ 10: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ టీవీఎస్ మోటర్ కంపెనీ..తాజాగా 2025 టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ 200 4వీ మోటర్‌సైకిల్‌ను పరిచయం చేసింది. అడ్వాన్స్ టెక్నాలజీ, సూపీరియర్ పనితీరు, భద్రత ప్రమాణాలను మెరుగుపరిచి ఈ బైకును తీర్చిదిద్దినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా కంపెనీకివున్న అవుట్‌లెట్లలో లభించనున్న ఈ బైకు ధర రూ.1,53,900గా నిర్ణయించింది. దేశీయ మార్కెట్లోకి అపాచీ బైకులు అడుగుపెట్టి 20 ఏండ్లు పూర్తైనట్టు, ఇప్పటి వరకు 60 లక్షల యూనిట్ల బైకులు దేశీయ రోడ్లపై దూసుకుపోతున్నాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.



## రాష్ట్రంలోకి 2 వేల కోట్ల పెట్టుబడులు


### ముందుకొచ్చిన యూఏఈ కంపెనీలు
### కొత్తగా 5వేల మందికి ఉద్యోగావకాశాలు




హైదరాబాద్, జూన్ 10(నమస్తే తెలంగాణ): పెట్టుబడులు ఆకట్టుకోవడంలో రాష్ట్రం దూసుకుపోతున్నది. తాజాగా యూఏఈకి చెందిన శైవ గ్రూపు, తారనిస్ క్యాపిటల్‌లు సంయుక్తంగా రూ.2,125 కోట్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇందుకు రాష్ట్రానికి చెందిన ఐదు స్థానిక కంపెనీలతో ఈ రెండు అరబ్ సంస్థలు అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. ఈ పెట్టుబడులతో కొత్తగా 5 వేల మందికి పైగా తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. వీటిలో శైవ గ్రూపు, తారనిస్ క్యాపిటల్ సంయుక్తంగా రివిలేషన్ బయోటెక్‌లో రూ.1,360 కోట్లు పెట్టుబడులు పెట్టబోతుండగా.. మనాకిన్ బయో రూ.340 కోట్లు, స్వబోధ ఇన్ఫినిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ అడ్వైజర్స్ రూ.80 కోట్లు, ఎగ్జిజెంట్ డ్రిల్లింగ్ టెక్నాలజీ రూ.90 కోట్లు, యెంత్రా టెక్ కంట్రోల్స్ రూ.255 కోట్ల మేర పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయని మంత్రి చెప్పారు. దీంతోపాటు వచ్చే మూడేండ్లలో బయోటెక్, ఏఐ, డాటా సెంటర్, డిఫెన్స్, ఎనర్జీ, ఫిన్‌టెక్ తదితర రంగాల్లో రూ.24 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు శైవ, తారనిస్ క్యాపిటల్ సంసిద్ధత వ్యక్తం చేసినట్టు శ్రీధర్ బాబు వెల్లడించారు. అలాగే ఈ రెండు సంస్థలు వచ్చే మూడేండ్లలో బయోటెక్ రంగంలో తినుబండారాల్లో చక్కెర శాతాన్ని తగ్గించడం, యాంటీ డయాబెటిక్, ఫుడ్ మేనేజ్‌మెంట ఉత్పత్తులు, ఫోర్త్ సిటీ, ఏఐ సిటీ రంగాల్లోవున్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి సంసిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి శైవ గ్రూపు చైర్మన్, సీఈవో అమిత్ జగన్నాథ్ వర్మ, తారనిస్ క్యాపిటల్ సీఈవో నికోలస్ ఎస్.బింగ్ హమ్, రివిలేషన్స్ బయోటెక్ ఎండీ రవిచంద్ర బీరం, మనాకిన్ బయో డైరెక్టర్ జశ్వంత్ ప్రణవ్ యతిరాజం, స్వబోధ ఇన్ఫినిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ అడ్వైజర్స్ సీఈవో సంకర్ష్ చందా, ఎగ్జిగెంట్ డ్రిల్లింగ్ టెక్నాలజీ డైరెక్టర్ పాండురంగా రావు తదితరులు హాజరయ్యారు.

# మోసపూరిత పెట్టుబడులు

- ఎంసీఏలో మనకిన్ బయో నమోదవ్వలేదు
- ఆ సంస్థ రూ.340 కోట్ల పెట్టుబడి అనుమానాస్పదమే
- నష్టాల్లో యెంత్రా టెక్ కంట్రోల్స్
- అయినా రూ.255 కోట్ల పెట్టుబడి?
- బీఆర్ఎస్ అధికార ప్రతినిధి క్రిశాంక్ సంచలన ఆరోపణలు



హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత పెట్టుబడులను ప్రకటించి ప్రజలను వంచిస్తున్నదని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి క్రిశాంక్ ధ్వజమెత్తారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో గోడాడి ఇండియా, స్వచ్ఛ్ బయో, వాల్ష్ కర్రా, ఉర్సాలాంటి సంస్థల పేరుతో అనుమానాస్పద పెట్టుబడులు ప్రకటిస్తున్నదని మండిపడ్డారు. మనకిన్ బయో సంస్థ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంసీఏ)లో కూడా రిజిస్టర్ కాలేదని పేర్కొన్నారు. ఎలాంటి నిర్దిష్ట వివరాలు లేకుండా ఒక మోసపూరిత వెబ్‌సైట్ ఈ ఏడాది మార్చి 16న సృష్టించారని ఆరోపించారు. ఆర్థిక పారదర్శకతలేని ఈ కంపెనీ రూ.340 కోట్ల పెట్టుబడి చేస్తున్నామని ప్రకటించడం అనుమానస్పదంగా ఉందన్నారు. నష్టాలను నమోదు చేస్తున్న యెంత్రా టెక్ కంట్రోల్స్ కంపెనీ రూ.255 కోట్ల పెట్టుబడి ఎలా పెట్టగలదు..? అని క్రిశాంక్ ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారంపై త్వరలో కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్తామన్నారు.



YENTRA TECH CONTROLS PRIVATE LIMITED
CIN - U74900TG2014PTC095623
Regd. Office: Ground Floor, Plot No 131, Road No 74 Jubilee Hills, Hyderabad, Telangana, India, 500033
rohit@yentra.org

DIRECTORS' REPORT

Dear Members,

Your directors have pleasure in presenting the 9th Annual Report of the Company together with the Audited Statements of Accounts for the financial year ended 31st March 2024.

1. FINANCIAL SUMMARY OR PERFORMANCE OF THE COMPANY:

The Net Financial Performance of the operations for the year are detailed herein under:

| Particulars | For the year ended 31st March 2024 (Rs) | For the year ended 31st March 2023 (Rs) |
|---|---|---|
| Total Income | - | |
| Depreciation | 233582.43 | 159348.21 |
| Expenditure(Excluding Depreciation) | 41033 | 2968504 |
| Profit before Tax | (274615.43) | (3127852.21) |
| Current Tax | | |
| Deferred Tax | 40025.27 | 45288.26 |
| Tax of earliers Years | | - |
| Profit/(loss) after Tax | (234590.16) | (3173140.47) |
| Earnings Per Share (in Rs) | (23.46) | (317.31) |

2. OPERATIONS:

During the year, the company there is no turnover/revenue from operations of against the previous year.

3. TRANSFER TO RESERVES:

During the year under review the company has transferred loss amount of Rs. (234590.16) to the reserves.

4. DIVIDEND:

No dividend was declared during the period.



manakin.bio

Domain Information

Registrar Information

Registrant Contact

Technical Contact

## హైదరాబాద్‌లో ఆల్‌కార్గో గతి ఎయిర్ డెలివరీ సేవలు

ముంబై, జూన్ 10: లాజిస్టిక్, సరఫరా సేవల సంస్థ ఆల్‌కార్గో గతి లిమిటెడ్..డైరెక్ట్ ఎయిర్ సర్వీసులను మరో ఎనిమిది నగరాలకు విస్తరించింది. కేవలం 24 గంటల్లో డెలివరీ చేయడానికి ఈ ప్రత్యేక సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం ఈ సర్వీసులను హైదరాబాద్‌తోపాటు ముంబై, పుణె, కోల్‌కతా, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్ నగరాల్లో ప్రవేశపెట్టింది. దేశవ్యాప్తంగా 34 కమర్షియల్ ఎయిర్‌పోర్ట్స్‌తో అనుసంధానం కావడానికి సంస్థ..ఎయిర్ ఎక్స్‌ప్రెస్‌తో ఒప్పందాన్ని కూడా కుదుర్చుకున్నది.

## ఐపీవోకి నాలుగు సంస్థలు

న్యూఢిల్లీ, జూన్ 10: దేశీయ ఈక్విటీ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి నాలుగు సంస్థలు సిద్ధమవుతున్నాయి. వీటిలో వ్యాటర్ ప్యూరిఫైర్ కంపెనీ కెంట్ ఆర్‌వో సిస్టమ్స్‌తోపాటు కారంతర ఇంజినీరింగ్, మంగల్ ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్, విద్యా వైర్స్‌ల ఐపీవోకి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వాటాల విక్రయం ద్వారా ఈ నాలుగు సంస్థలు కనిష్టంగా రూ.2,500 కోట్ల నిధులను సేకరించాలనుకుంటున్నాయి.

## 'గ్లోబల్ ఫౌండేషన్' లీలలు ఎన్నెన్నో..!

- మనీ కోసం ఏ ఉద్యోగమైనా ఇప్పిస్తానన్న వీర'మణి'
- గతంలో పంచాయతీరాజ్‌లో ఉద్యోగాల పేరుతో రూ.కోట్లల్లో టోకరా
- రైల్వే, రెవెన్యూ, ప్రభుత్వ పాఠశాలల్లో ఉద్యోగాల పేరుతో భారీ మోసం
- బాధితులలో ఒకరు కానిస్టేబుల్ కుటుంబం

కోస్గి, జూన్ 10 : గ్లోబల్ ఫౌండేషన్ పేరుతో నిరుద్యోగులను నిండా ముంచిన ఘటనలో అనేక సంచలన విషయాలు బయటికొస్తున్నాయి. గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ చైర్మన్ బాబర్ 2023 నుంచే తమ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత సేవ పేరుతో అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగా అప్పట్లో అధికారులు ఆ దరఖాస్తును తిరస్కరించారు. దీంతో చేసేది లేక కొత్త ప్రభుత్వం వచ్చాక పైరవీలతో ఆగస్టు 2024లో అనుమతి పొందారు. ఇక అంతకుముందే వికారాబాద్ జిల్లాలోని తాండూర్, కొడంగల్, యాలాల్, కందెనెల్లి, జుంటుపల్లి, ముంబాపూర్, దౌల్తాబాద్, గోకఫసలాబాద్, బాలంపేట, హస్నాబాద్, చల్లాపూర్, నారాయణపేట జిల్లాలోని నారాయణపేట, కోస్గి, ముశ్రీఫా, మద్దూర్, క్యాతన్‌పల్లి, దామరగిద్ద, మొగలమడ్క గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వలంటీర్లను నియమించి రూ.లక్షలు దండుకున్నారు. జీతాల కోసం వారు నాగోల్‌లోని గ్లోబల్ ఫౌండేషన్ కార్యాలయానికి ఎన్నిసార్లు తిరిగినా రేపు.. మాపు అంటూ కాలం వెల్లదీశారు తప్పా నిరుద్యోగులకు జీతాలు ఇచ్చింది లేదు. ఇక ఆగస్టులో అనుమతి రాగానే ప్రత్యేక సమావేశం నిర్వహించి తమ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని కరీంనగర్, నిజామాబాద్, పెద్దపల్లి, సూర్యపేట, నారాయణపేట డీఈవోల అనుమతి పత్రాలను చూపించి మరో 300 మంది వలంటీర్లను నియమించినట్టు సమాచారం. దీంట్లో వీరమణి, గౌస్‌పాషా, నెహ్రూనాయక్ అనే ముగ్గురు కలిసి ఈ తతంగాన్ని నడిపి వచ్చిన డబ్బుల్లో బాబర్‌కు యాభైశాతం మిగితా యాభై శాతంలో ముగ్గురు షేర్ చేసుకొని ఈ వ్యవహారం నడిపిస్తున్నారు. కొత్త వలంటీర్లను ఇస్తే వారికి కూడా రూ.ఐదు, పదివేలు ఇచ్చినట్టు బాధితులు తెలిపారు. గతంలో ఇదే విధంగా రిలయన్స్ ఫౌండేషన్ పేరుతో నెహ్రూనాయక్ వీరమణి ఇద్దరు కలిసి 10మంది నిరుద్యోగుల దగ్గర డబ్బులు తీసుకొని మోసం చేసినట్టు బాధితులు తెలిపారు. ఆ బాధితులు నిలదీసి అడగగా గ్లోబల్ ఫౌండేషన్‌లో వారిని చేర్పించినట్టు మరికొంత మంది బాధితులు చెప్పారు. 2023 నుంచి 2025 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఏ ఒక్క అధికారికి కూడా అనుమానం రాకుండా పనికానిచ్చారు. ఇక ఇదే విషయంలో కొందరు బాధితులు తమ డబ్బులు తమకు తిరిగి ఇవ్వమన్న కూడా ఇవ్వకుండా వారినే భయపెట్టడంతో కొందరు అలాగే కిమ్మన కుండా ఉండిపోయారు. ఇక బాధితులలో కొందరు ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఉన్న వారు కూడా పైకి చెప్పుకోలేక పోతున్నారు. గతంలో వీరమణి పలువురిని మోసం చేయడంతో కేసు నమోదు కాగా ఆమె జైలుకు కూడా వెళ్లి వచ్చారు. అయినా ఆమె తీరు మార్చుకోకుండా బాబర్ తదితరులతో కలిసి గ్లోబల్ ఫౌండేషన్ అనే సంస్థను ఏర్పాటు చేసిన కొత్త నాటకాలకు తెరతీశారు. వీరు మొత్తం పదిమందికి పైగా సభ్యులు ఉన్నట్లు సమాచారం. అయితే వీరు ఇన్ని మోసాలకు పాల్పడుతున్నా ఏ ఒక్క అధికారి కూడా స్పందించకపోవడం గమనార్హం.

## మా కాలనీ సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

కల్వకుర్తి రూరల్, జూన్ 10 : కల్వకుర్తి పట్టణంలోని డబుల్ బెడ్‌రూం కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. మంగళవారం కల్వకుర్తి కాలనీ కమిటీ సభ్యులు సమావేశమై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీ కమిటీ సభ్యులు మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కరెంట్ మీటర్లు ఇవ్వలేదని స్తంభాలకు కొండ్లు తగిలించుకుని వేలాడదీసుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షానికి కాలనీ ప్రాంతమంతా మడుగులా మారుతోందని వెంటనే కాలనీలో సీసీ రోడ్లు వేయించాలని ప్రజాప్రతినిధులను డిమాండ్ చేశారు. కాలనీలో అవసరమైనన్ని విద్యుత్ స్తంభాలను, స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. కాలనీకి చెత్త సేకరణలకు చెత్త బండిని పంపించాలని మున్సిపల్ అధికారులను కోరినా ఇప్పటికీ పంపించడం లేదన్నారు. ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు సర్టిఫికెట్ అందించి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలనీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ డెవలప్‌మెంట్ అధ్యక్షుడు ఆంజనేయులు, నర్సింహ, కృష్ణవేణి, పద్మతోపాటు కాలనీ సభ్యులు ఉన్నారు.

# టీజీపీఈ సెట్‌కు సర్వం సిద్ధం

- నేటి నుంచి పీయూలో ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, స్కిల్ టెస్టులు
- రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 3వేల మందికి పైగా అభ్యర్థులు
- రోజుకు 750 మందికి పైగా 4రోజులపాటు శారీరక సామర్థ్య పరీక్షలు
- 20 మంది ప్రత్యేక పరిశీలకులు, 50 మంది టెస్టర్లు నియామకం
- సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌పై మొదటిసారిగా ఈవెంట్స్ నిర్వహణ
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడి




ఈవెంట్స్ నిర్వహణకు సిద్ధమైన సింథటిక్ ట్రాక్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 10 : తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీ పీఈ సెట్)2025కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 11 నుంచి 14 వరకు పాలమూరు యూనివర్సిటీలో అభ్యర్థులకు ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, స్కిల్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఈ పరీక్షల ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికి రెండేళ్ల బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కల్పిస్తారు. పీయూలో ఈవెంట్స్‌ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నారు. విశిష్ట అతిథిగా పీయూ పూర్వపు వైస్‌చాన్స్‌లర్ లక్ష్మీకాంత్‌రాథోడ్ రానున్నారు. తెలంగాణలోని యూజీ డీపీఈడీ, బీపీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీజీపీఈసెట్-2025 బాధ్యతను రాష్ట్ర ఉన్నత విద్యామండలి మహబూబ్‌నగర్ పాలమూరు యూనివర్సిటీకి అప్పగించింది. ఈ నేపథ్యంలోనే టీజీ పీఈ సెట్ నిర్వహణకు పీయూ క్రీడామైదానాలు సిద్ధం చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు వీసీ జీఎన్.శ్రీనివాస్, కన్వీనర్ దిలీప్‌కుమార్ ఆదేశాలతో యూనివర్సిటీ హాస్టల్స్‌లో బసచేయడానికి సైతం పీయూ ఫిజికల్ డైరెక్టర్ డా.వై.శ్రీనివాసులు, అధ్యాపకుడు వెంకటేశ్‌యాదవ్ ఏర్పాట్లు పూర్తి చేశారు. 20 మంది ప్రత్యేక పరిశీలకులు (అబ్జర్వర్లు), 50 మంది టెస్టర్లు, 50 మందికి పైగా వాలంటీర్ల సేవలను ఈ శారీరక సామర్థ్య పరీక్షల నిర్వహణకు వినియోగించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి ఫిజికల్ ఈవెం ట్స్ బ్యాచ్ వారీగా ఆయా పరీక్షా కేంద్రాల్లో ప్రారంభమవుతాయి. అయితే అభ్యర్థులు నిర్ణీత సమయానికంటే ముందుగానే ఆయా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది.

**సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌పై మొదటి సారిగా ..**

దేశంలోనే ప్రప్రథమంగా తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ హయాంలో ఓ క్రీడా నేపథ్యం ఉన్న ప్రొఫెసర్‌కు వైస్‌చాన్స్‌లర్ బాధ్యతలు అప్పగించింది. మహబూబ్‌నగర్ ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కొండగల్ నియోజకవర్గంలోని మద్దూరు మండలం తిమ్మారెడ్డిపల్లికి చెందిన గిరిజన ఆణిముత్యం ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్‌ను పీయూ వైస్‌చాన్స్‌లర్‌గా బీఆర్ఎస్ ప్రభుత్వం నియమించడం చరిత్రగా చెప్పవచ్చు. లక్ష్మీకాంత్‌రాథోడ్ హయాంలోనే పాలమూరు యూనివర్సిటీలో సింథటిక్ ట్రాక్‌ను రూ.8కోట్లకు పైగా వెచ్చించి ఏర్పాటు చేశారు. ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్ 22 మే 2021 నుంచి 21 మే 2024 వరకు వీసీగా కొనసాగారు. ఆయన హయాంలోనే పీయూకు కేంద్రం రూ.100 కోట్ల నిధులు కేటాయించింది. ఇందుకు ఆయన ఎంతగానో కృషి చేశారు. ఆయన స్పోర్ట్స్‌మెన్‌గా వివిధ కాన్ఫరెన్స్‌లు, టోర్నమెంట్‌లలో, ఒలింపిక్స్ ఇలా ఆయన 28 దేశాల్లో పర్యటించారు. పీయూ అభివృద్ధిలో ఆయన పాత్ర అత్యంత కీలకం అని చెప్పవచ్చు. పీయూలోని సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, పీ యూ పీజీ కళాశాల మైదానంలో ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించనున్నారు. పీయూ వైస్ చాన్స్‌లర్ జీఎన్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ ఈవెంట్స్ (క్రీడలను) పురుషులు, మహిళలకు వేర్వేరు ప్రాంతాల్లో పూర్తి చేయనున్నారు. వివిధ విభాగాల్లో అభ్యర్థులకు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3వేలకు పైగా అభ్యర్థులు హాజరు కానున్నారు. ఒకేరోజు పురుషులు, మహిళలకు వేర్వేరుగా పరీక్షలు చేసేలా ఏర్పాట్లు చేశారు.



ఈవెంట్స్ నిర్వహణపై సూచనలు చేస్తున్న పీయూ ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు

**శారీరక సామర్థ్య పరీక్షలు ఇలా..**

పీఈ సెట్‌కు హాజరయ్యే అభ్యర్థులకు మూడు అంశాల్లో ఫిజికల్ టెస్ట్‌లు నిర్వహించనున్నారు. పురుషులకు 100 మీటర్లు, 800 మీటర్ల పరుగు, షార్ట్‌పుట్ (6.00కిలోల బరువు), హైజంప్ లేదా లాంగ్ జంప్ ఉంటాయి. మహిళా అభ్యర్థులకు 100 మీటర్ల పరుగు, 400 మీటర్ల పరుగు, షాట్‌పుట్ (4.00కిలోల బరువు), లాంగ్‌జంప్ లేదా హైజంప్ ఉంటాయి. స్కిల్ టెస్టులో భాగంగా పురుషులు, మహిళలు తప్పనిసరిగా బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, లాన్ టెన్నీస్, వాలీబాల్ ఇలా ఏదో ఒకటి మూడో అంశం అభ్యర్థుల ఆసక్తి మేరకే ఎంచుకోవాల్సి ఉంటుంది. రోజుకు 750 మందికి పైగా అభ్యర్థులకు సామర్థ్య పరీక్షలు నిర్వహించనున్నారు.

## డీసెట్ ధ్రువపత్రాల పరిశీలన

- 312 మంది అభ్యర్థులు హాజరు
- లాంగ్ మెమోలు లేక పలువురు వెనక్కి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 10 : డీసెట్-2025లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు 2025-2027 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరంలో తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలో అడ్మిషన్లకు మహబూబ్‌నగర్ డైట్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ మేరాజుల్లాఖాన్ పర్యవేక్షణలో చేపట్టిన ఈ పరిశీలనకు మంగళవారం 500 మంది విద్యార్థులకు గానూ 312మంది హాజరయ్యారు. చాలా వరకు చంటిపిల్లలు, కుటుంబ సభ్యులతో కలిసి మహిళా అభ్యర్థులు హాజరయ్యారు. కొందరు షార్ట్ మెమోలు తీసుకురావడంతో ధ్రువపత్రాల పరిశీలన అభ్యర్థులు అనుమతించలేదు. లాంగ్ మెమోలు తీసుకురావాలని సూచించారు. మరికొంత మంది అభ్యర్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో వారిని జనరల్ కేటగిరీలో పెడతామని హెచ్చరిస్తూ.. కుల ధ్రువీరణ పత్రాలు తీసుకురావాలని తిప్పి పంపారు. గైర్హాజరు అయిన అభ్యర్థులంతా 13వ తేదీలోపు వారి ఒరిజినల్ ధ్రువపత్రాలు, ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, ఎస్సెస్సీ, ఇంటర్ మెమోలు, 4వ తరగతి నుంచి 12వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, టీసీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, పీహెచ్‌సీ ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో వచ్చి ధ్రువపత్రాలు పరిశీలించుకొనుటకు జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ డా.మొహ్మద్ మేరాజుల్లాఖాన్ తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెం.9949993714ను సంప్రదించాలని పేర్కొన్నారు.

## టీబీ డ్యాంకు స్వల్ప వరద

- ఇన్‌ఫ్లో 4,150, అవుట్‌ఫ్లో 147 క్యూసెక్కులు

అయిజ, జూన్ 10 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానలకు తుంగభద్ర జలాశయానికి వరద స్వల్పంగా కొనసాగుతున్నది. మంగళవారం టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో 4,150 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 147 క్యూసెక్కులు నమోదైంది. గరిష్ఠనీటి మట్టం 1633 అడుగులకు గానూ ప్రస్తుతం 1601.98 అడుగుల నీటిమట్టం ఉండగా, 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 24.184 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. అలాగే కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద తగ్గుముఖం పట్టింది. ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోగా, కన్‌స్ట్రక్షన్ స్లూయిస్ ద్వారా దిగువన ఉన్న సుంకేసుల బారాజ్‌కు 195 క్యూసెక్కులు చేరుతుండగా, ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 128 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్‌లో 6 అడుగుల మేర నీటి మట్టం ఉన్నది.

## జల విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం

అమరచింత, జూన్ 10 : గత వారం రోజులుగా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు నిలిచిపోవడంతో ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఎగువ నుంచి స్వల్పంగా వరద ప్రారంభం కావడంతో మంగళవారం విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించినట్లు జల విద్యుత్ ప్రాజెక్టు అధికారి పవన్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎగువ జూరాల జలవిద్యుత్ కేంద్రంలో 840 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తితో ఇప్పటి వరకు మొత్తం 14. 371 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కాగా, దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 964 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తితో ఇప్పటి వరకు మొత్తం 15.646 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయినట్లు వెల్లడించారు.

## రైతు ఆత్మహత్యాయత్నం

గద్వాల అర్బన్, జూన్ 10 : అధికారుల అండదండలతో ఓ వ్యక్తి ప్రభుత్వ భూమితోపాటు పట్టా భూమిని కూడా అక్రమించుకునేందుకు ప్రయత్నించడంతో మనస్థాపానికి గురైన రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కేటీదొడ్డి మండలంలో మంగళవారం చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. కేటీదొడ్డి మండలం రంగాపురానికి చెందిన ముచ్చు సవారప్ప, బంగారప్ప ఇద్దరు అన్నదమ్ములు. వీరికి ఉమిత్యాల గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ భూమిని సాగుచేసుకుంటున్నారు. వీరి పొలం సమీపంలోనే ప్రభుత్వ భూమిని బస్సాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కబ్జా చేసి సాగు చేసేందుకు సిద్ధమయ్యాడు. ఈ విషయమై సవారప్ప, బంగారప్ప తాసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం రాత్రి ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వ్యక్తి హిటాచితో ప్రభుత్వ భూమితోపాటు సవారప్ప, బంగారప్పలకు సంబంధించిన పట్టా భూమిని కూడా కబ్జా చేసేందుకు యత్నించాడు. దీంతో దౌర్జన్యం చేసేవారిని ఎదుర్కోలేక నిస్సహాయ స్థితిలో బంగారప్ప పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి గద్వాలలోని ప్రభుత్వ దవాఖానకు చికిత్స కోసం తరలించారు. ఈ విషయమై సంబంధిత శాఖల అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా, అందుబాటులోకి రాలేదు.

## భార్యతో గొడవ పడి భర్త ఆత్మహత్య

మాగనూరు, జూన్ 10 : భార్యతో గొడవపడి భర్త కోనేరులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకున్నది. మాగనూరుకు చెందిన వాకిటి పరశురాం (39) తాగుడుకు బానిసై భార్య ముత్యంతో నిత్యం గొడవలకు దిగుతుండేవాడని అయితే సోమవారం సాయంత్రం భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడని రాత్రి మొత్తం ఇంటికి రాకపోవడంతో భార్య స్థానిక పోలీస్ స్టేషన్లో భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేసిందని అయితే మంగళవారం మాగనూరు నర్సింహస్వామి ఆలయం కోనేరులో ఓ గుర్తు తెలియని శవం నీటిపై తెలియాడుతుండడంతో చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడతామని ఎస్సై అశోక్ బాబు తెలిపారు.